సాక్షి
వికారాబాద్
ఆదివారం । 6 । ఆగస్టు । 2023



ఎరువు.. కరువు!

వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సాగు పనుల్లో నిమగ్నమవుదామనుకున్న కర్షకులను ఎరువుల కొరత వేధిస్తోంది. 10లో▸



సుదీర్ఘ కాలయాపన!

దోర్నాల్–స్టేషన్‌ధారూరు మధ్య కాగ్నా నదిపై నిర్మిస్తున్న వంతెన పనులు 2017 నుంచి నత్తనడకన కొనసాగుతున్నాయి. 10లో▸



కూలీల కొరత..

వ్యవసాయానికి కూలీల కొరత వేధిస్తోంది. వరినాట్లు వేసే సమయం కావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. 11లో▸

న్యూస్‌రీల్

9 నుంచి సదరం క్యాంపు

తాండూరు టౌన్: జిల్లా పరిధిలోని వికారాబాద్, తాండూరు ప్రభుత్వాస్పత్రుల్లో ఈ నెల 9 నుంచి సదరం క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్ శనివారం ఓ ప్రకనటలో తెలిపారు. ఈ నెల 9, 22న వికారాబాద్, పూడూరు, దోమ, కుల్కచర్ల, పరిగి, మర్పల్లి, మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, కోట్‌పల్లి, మండలాల పరిధిలో ఎముకల వైకల్యం ఉన్నవారికి వికారాబాద్ ఆస్పత్రిలో, 10, 17 తేదీల్లో కొడంగల్, బొంరాస్‌పేట్, బంట్వారం, దౌల్తాబాద్, తాండూరు పట్టణం, తాండూరు మండలం, ధారూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల వారికి తాండూరు ప్రభుత్వాస్పత్రిలో క్యాంపు ఉంటుందన్నారు. 22, 29న జిల్లా పరిధిలో బుద్ధిమాంద్యం, మానసిక అనారోగ్యంతో బాధపడేవారికి, 30న వినికిడిలోపంతో బాధపడే వారికి తాండూరులో క్యాంపు ఉంటుందని వివరించారు.

తాండూరు అసెంబ్లీ బరిలో ఉంటా

డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి



పెద్దేముల్: వచ్చే ఎన్నికల్లో తాండూరు అసెంబ్లీ బరిలో ఉంటానని డీసీసీబీ మాజీ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని తట్టెపల్లి పీఏసీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ లో ఉంటానన్నారు. చిన్నతనం నుంచే తమ కుటుంబం ప్రజల మధ్యే ఉందని గతంలో మున్సిపల్ చైర్మన్‌గా, ప్రస్తుతం తట్టెపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగుతున్నాని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రైతుల ఆశీస్సులే తనను ఎమ్మె ల్యేగా గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

క్రమబద్ధీరణకు నిబంధనలు తప్పనిసరి

ఆర్డీఓ విజయకుమారి



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ విజయకుమారి

మోమిన్‌పేట: ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉంటేనే ఇళ్ల క్రమబద్ధీకరణ చేస్తామని ఆర్డీఓ విజయకుమారి అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని చంద్రశేఖర్‌నగర్ కాలనీ సమీపంలో 59జీఓ కింద వచ్చిన తొమ్మిది దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం ఉన్న వాటినే సమ్మతిస్తామన్నారు. కొన్ని దరఖాస్తులు వాణిజ్యపరమైనవి ఉన్నాయని వాటికి ప్రభుత్వ నిబంధనలు వర్తించవని తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఆర్ఐ రాజు తదితరులున్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే ఫలితాలు

డీఈఓ రేణుకాదేవి



మాట్లాడుతున్న రేణుకాదేవి

మోమిన్‌పేట: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ)శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొలిమెట్టు–2.0 కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు తెలుగు, ఇంగ్లిష్, గణితం అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటితో ప్రతీ విద్యార్థి చదవడం.. రాయడంతో పాటుగా గణితంలోనూ మెలకువలు నేర్చుకునేందుకు ఉపయోగపడతాయని సూచించారు. వీటిని నేర్చుకోకుండా ఉన్నత తరగతులకు వచ్చినా ఫలితం ఉండదన్నారు. ఉపాధ్యాయులు ఈ మూడింటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్, నోడల్ అధికారి మల్లేశం, ఉపాధ్యాయులు షఫీ, మల్లయ్య, రిసోర్సు పర్సన్‌లు రాములు, గోపాల్ ఉన్నారు.

స్వచ్ఛతలో జీపీలు సూపర్

ప్రత్యేక రాష్ట్రంలో పంచాయతీల స్వరూపం పూర్తిగా మారిపోతోంది. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తూ కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నారు. ఈ ఎరువును నర్సరీలకు వినియోగిస్తున్నారు.

పంచాయతీల్లో పెరుగుతున్న అవగాహన

- ప్రతీ గ్రామంలో ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ
- జిల్లా వ్యాప్తంగా 563 గ్రామాల్లో డంపింగ్‌యార్డ్‌ల ఏర్పాటు



పెళ్లిమడుగులో కంపోస్టు ఎరువు తయారు చేస్తున్న పంచాయతీ కార్మికులు

వికారాబాద్: మీవాడకు చెత్త బండి వచ్చింది.. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వండి.. ఆరు బయట చెత్త వేస్తే జరిమానా విధించబడును.. ప్రస్తుతం ప్రతీ గ్రామంలో.. పొద్దునే మైకుల్లో వినిపిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో చెత్త సేకరణలో పంచాయతీలు పురోగతిని సాధిస్తున్నాయి. ఇప్పటికే పలు గ్రామాలకు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి అవార్డులు సైతం వరించాయి.త్వరలోనే గ్రామాల్లో విప్లవాత్మక మార్పునకు నాంది పలుకుతాయనే సంకేతాలు స్పష్టంగా కనిస్తున్నాయి. అధికారులు చెత్త సేకరణకు గ్రామ పంచాయతీలకు ట్రాక్టర్లు అందజేసి ప్రతీ పంచాయతీ డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. ఈ యార్డుల్లో తడి,పొడి చెత్త వేరు చేయటం.. వేరు చేసిన చెత్తతో కంపోస్టు ఎరువుల తయారీ తదితర కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారు. దీంతో వర్షాకాలంలో అపరిశుభ్రంగా దర్శనమిచ్చే గ్రామాలు నేడు పారిశుద్ధ్య నిర్వహణలో భేష్ అనిపించుకుంటున్నాయి. అధికారుల నిరంతర పర్యవేక్షిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల వారీగా రోజు వాట్సాప్ గ్రూపుల ద్వారా పారిశుద్ధ్య నివేదికలు సేకరిస్తున్నారు.

ప్రభుత్వం యంత్రాంగం ప్రత్యేక దృష్టి

జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమంపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా వ్యాప్తంగా 571 గ్రామ పంచాయతీలుండగా.. 563 గ్రామాల్లో డంపింగ్ యార్డులున్నాయి. చెత్త పోగు చేసేందుకు, తరలించేందుకు జిల్లాలో అన్ని పంచాయతీలకు ప్రభు త్వం ట్రాక్టర్లను అందజేసింది. ప్రతీ గ్రామంలో గ్రా మ జనాభాకు అనగునంగా ఒకరి నుంచి నలుగురి వరకు పారిశుద్ధ్య కార్మికులను నియమించి చెత్త సేకరణ, మురుగు కాల్వలను శుభ్రం చేయడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు.

తగ్గిన సీజనల్ వ్యాధులు

అధికార యంత్రాంగం పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపిస్తున్నాయి. వర్షాకాలంలో డెంగీ కేసులు విజృంభించేవి. కానీ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం పది డెంగీ కేసులు కూడా నమోదవ్వలేదు. ప్రతీ పంచాయతీ పదుల సంఖ్యలో అతిసారం బారిన పడేవారు. కానీ మూడేళ్లుగా జిల్లా వ్యాప్తంగా ఒక్క కేసు నమోదవ్వలేదు. దోమల నివారణకు గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ చేయాలని ఇప్పటికే ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. జీపీలను క్లస్టర్లుగా విభజించి అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని నిర్ణయించారు.

అందరి సహకారంతోనే సాధ్యం



కలెక్టర్ పారిశుద్ధ్యం విషయంలో సీరియస్‌గా ఉన్నారు. తాము సైతం పారిశుద్ధ్యం, వేస్ట్ మేనేజ్‌మెంట్, వర్మికంపోస్టు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. పంచాయతీ కార్యదర్శులు ఇందుకు సహకరిస్తున్నారు. సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో నిరంతర కార్యక్రమంగా కొనసాగిస్తాం. చెత్త ఆరుబయట వేయకూడదనే కట్టుబాటు, నియమం వచ్చినప్పుడే సఫలీకృతం అవుతాం.

– తరుణ్‌కుమార్, డీపీఓ



పరిగి: డిపో ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

ఆర్టీసీ విలీనానికి అనుమతివ్వండి

ప్రజా రవాణా వ్యవస్థను బాధ్యతగా భావించిన సర్కారు కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ప్రకటన చేసింది. ఇందుకు సంబంధించిన బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపగా.. ఆమె న్యాయ సలహా పేరుతో ఇబ్బంది పెడుతోందని ఆరోపిస్తూ టీఎంయూ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆర్టీసీ కార్మికులు పరిగి, వికారాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకు ఆందోళన చేపట్టారు. దీంతో బస్సులన్నీ డిపోకే పరిమితమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల విలీనానికి గవర్నర్ వెంటనే ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు.

– అనంతగిరి/పరిగి



వికారాబాద్: డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల ధర్నా

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



కాంగ్రెస్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

పరిగి: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం చేకూరుతుందని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణ కేంద్రంలోని తుంకుల్‌గడ్డలో పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మాటలతో మభ్యపెడుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. నిత్యం ప్రజల్లలో ఉంటూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కౌన్సిలర్ శ్రీనివాస్, పార్టీ బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి, అశోక్, అక్బర్, సర్వర్, అభిరాం, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను విస్తృతం చేయాలి

- అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్ అర్బన్: రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను జిల్లా వ్యాప్తంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం స్థానిక సద్గురు సాయిరాం ఆస్పత్రి ప్రాంగణంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా రెడ్‌క్రాస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా సాయి చౌదరి, వైస్ చైర్మన్‌గా సత్యనారాయణ గౌడ్, కోశాధికారిగా డాక్టర్ గంట గాలి నాయుడు, కమిటీ సభ్యులుగా నరసింహారెడ్డి, సుధాకర్ రెడ్డి, బస్వరాజ్, డాక్టర్ సాయి ప్రత్యూష్ గౌడ్, వేణుగోపాల్, అంబదాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి శంకరాచారి, జిల్లా సహకార సొసైటీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ అజ్మత్‌పాషా పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీ సభ్యులు

నేడు తాండూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ

తాండూరు: తాండూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దక్షిణమధ్య రైల్వే శాఖ అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. తాండూరు రైల్వే స్టేషన్ పునపునరుద్ధరణ పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.24.04 కోట్ల నిధులు మంజూరైన విషయం విదితమే. ఈ నిధులతో ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రైల్వే స్టేషన్ ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించారు.



పునరుద్ధరణ పనుల అనంతరం స్టేషన్ ప్రాంగణ నమూనా చిత్రం

పరిశ్రమలు స్థాపించండి

శాసన సభలో కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శనివారం అసెంబ్లీలో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిరుద్యోగులు ఉపాధి కోసం వలస వెళ్తున్నారన్నారు. దౌల్తాబాద్ మండలం చంద్రకల్ శివారులో సర్వే నంబర్ 29లో 100 ఎకరాల ప్రభుత్వ భూమి పరిశ్రమల స్థాపనకు అనువుగా ఉన్నందున ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ వేయండి

శాసనసభలో పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి శనివారం శాసనసభ సమావేశాల్లో ప్రసంగించారు. ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటోంది. అన్ని శాఖల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి. ఈ నోటిషికేషన్ కోసం బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఎంతో మంది ఎదురుచూస్తున్నారన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తాండూరు టౌన్: రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం రుక్మాపూర్, ధారూర్ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. ట్రాక్‌పై సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతుడి ఒంటిపై ఎరుపు రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంటు ఉందని చెప్పారు. కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు. వివరాలకు 9553195100 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆసుపత్రికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యం


వడ్డె వెంకటయ్య

ధారూరు: ఆసుపత్రికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన తండ్రి, మూడు రోజులైనా ఇంటికి రాలేదని ఆయన కొడుకు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. ధారూరు మండలం కొండాపూర్‌కలాన్ గ్రామానికి చెందిన వడ్డె వెంకటయ్య(68) ఈనెల 2న ధారూరు ఆసుపత్రికి వెళ్లి వస్తానని ఇంట్లో ఉన్న మనుమనికి చెప్పి వెళ్లిపోయాడు. కొడుకు నర్సింహులు.. రాత్రి అయినా ఇంటికి రాని తండ్రి కోసం గ్రామంలో, బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీశారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. తప్పిపోయిన వెంకటయ్య తెల్ల అంగి, తెల్ల పంచె ధరించి ఉన్నాడని, కర్ర సహాయంతో నడుస్తాడని ఎస్ఐ చెప్పారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు పోలీసుల దృష్టికి తీసుకురావాలని, లేదా 8712670033 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఐ సూచించారు.

డ్యూటీకి వెళ్లి..

శంషాబాద్: పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీలో గడ్డం సాయితేజ (23) స్థానికంగా ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 4న కంపెనీలో యథావిధిగా డ్యూటీకి వెళ్లాడు. మరుసటి రోజు తిరిగి వస్తున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో అన్ని చోట్లా వెతికిన కుటుంబసభ్యులు శనివారం ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

కొనసాగుతున్న ఎల్‌ఎఫ్ఎన్ శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: మండల స్థాయిలో ప్రాధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్, లిటరసి అండ న్యూమరసి) శిక్షణా కార్యక్రమం శనివారం నాలుగోరోజు జరిగింది. బొంరాస్‌పేట మండలంలో 45, దుద్యాలలో 20 మంది హెచ్ఎంలు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. శిక్షణ తరగతులు బొంరాస్‌పేట మండల గణితం ఆర్పీలు అనిల్‌కుమార్, జీవన్‌కుమార్, దుద్యాలలో నర్సింహులు, అశోక్ ఇచ్చారు. కార్యక్రమాన్ని నోడల్ అధికారి పాపిరెడ్డి పర్యవేక్షించారు. బొంరాస్‌పేట మండలంలో సీఆర్‌పీలు సోమ్లా, శంకరయ్య, దుద్యాల మండలంలో సీఆర్‌పీ రాందాస్, ఎమ్మార్సీ సిబ్బంది గౌసుద్దీన్ పాల్గొన్నారు.

ఎరువు.. కరువు!

వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సాగు పనుల్లో నిమగ్నమవుదామనుకున్న కర్షకులకు ఎరువుల కొరత వేధిస్తోంది. ఎరువుల కోసం రోజుల తరబడి వ్యవసాయ సహకార సంఘాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. మూడు రోజులుగా తిరిగితే మూడే సంచులు, ఆరు గంటలు నిల్చుంటే ఒక బస్తా ఇచ్చారని, సర్కారు సాగుకు సహకరించడం లేదని పలువురు అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

మూడు రోజులు తిరిగితే.. మూడు సంచులే..

- అరకొర సరఫరాతో.. సమస్య తీవ్రం
- ఎరువుల కోసం రైతన్నల పడిగాపులు
- సాగుకు సర్కారు సహకరించడం లేదంటూ మండిపాటు


తట్టెపల్లి పీఏసీఎస్ ఎదుట ఎరువుల కోసం కూర్చున్న రైతులు

పెద్దేముల్: ఎరువుల కోసం అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. రైతులతో పాటు డీసీసీబీ మాజీ చైర్మన్, ప్రస్తుత తట్టెపల్లి పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి వరుసలో నిలబడి ఎరువులు విక్రయించారు. సరిపడా ఎరువు బస్తాలు ఇవ్వక పోవడంతో.. అన్నదాతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. శనివారం పెద్దేముల్ మండలం తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట ఎరువుల కోసం నిరీక్షించి, నీరసనించిన రైతులు మాట్లాడారు. ఎకరాకు సుమారు ఐదు బస్తాల ఎరువు అవసరం ఉండగా.. బ్యాంకు అధికారులు పట్టా పాసు బుక్‌పై రెండు, మూడు బస్తాలు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంటుందని, సంబంధిత అధికారులు, పాలకులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపించారు. ఇదిలా ఉండగా.. లక్ష్మారెడ్డికి 30 బస్తాల ఎరువు అవసరం ఉండగా.. క్యూలో నిల్చొని మూడు బస్తాలతో సరిపెట్టుకున్నారు.

ఇలా ఇస్తే సాగుఎలా?

ఎకరా చెరుకు పంటకు 5నుంచి 6 బస్తాల యూరియ అవసరం ఉంటుంది. బ్యాం అధికారులు పట్టా పాసుబుక్‌పై మూడు సంచుల ఎరువు ఇస్తున్నారు. ఇలా ఇస్తే సాగు ఎలా చేయాలని పలువురు రైతులు ప్రశ్నించారు. మండలంలోని 30రెవెన్యూ గ్రామాల్లో ఖరీఫ్‌కు 24,751 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. అందుకు సుమారు డీఏపీ–780మెట్రిక్ టన్నులు, యూరియ–1815ల మెట్రిక్ టన్నులు, పొటాష్–400లు, కాంప్లెక్స్–500 మెట్రిక్ టన్నులు అవసరం ఉందని ఏఓ నజీరొద్దీన్ తెలిపారు. కనీసం ఎకరాకు నాలుగు నుంచి ఐదు బస్తాల ఎరువులు అందచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సరిపడా అందేలా కృషి

- తట్టెపల్లి పీఏసీఎస్ సంఘం చైర్మన్ లక్ష్మారెడ్డి


ఎరువు సంచులను తన కారులో వేసుకుంటున్న చైర్మన్ లక్ష్మారెడ్డి

వానాకాలం సీజన్ నుంచి ఇప్పటి వరకు తట్టెపల్లి వ్యవసాయ సహకార సంఘానికి 500 టన్నుల యూరియ, 25 టన్నుల డీఏపీ, 22 టన్నుల 20–20 ఎరువులు వచ్చాయని పీఏసీఎస్ సంఘం చైర్మన్ లక్ష్మారెడ్డి చెప్పారు. వచ్చిన ఎరువు బస్తాలు ఈ ప్రాంత రైతులకు సరిపోవని, సకాలంలో సరిపడా ఎరువులు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మలి విడతలో ఎటువంటి సమస్య రాకుండా చూస్తానన్నారు. సకాలంలో ఎరువులు అందజేయడానికి తట్టెపల్లిలో రూ.75 లక్షల నాబార్డు నిధులతో గోదాం ఏర్పాటు చేశామన్నారు.

సాగు మానేస్తం..



ఎరువుల కోసం మూడు రోజుల నుంచి ఎదురు చూస్తే.. తట్టెపల్లి వ్యవసాయ సహకార సంఘం అధికారులు మూడు సంచుల ఎరువు ఇచ్చారు. అది ఏ మూలకు సరిపోదు. మళ్లీ అధిక ధరలకు మార్కెట్లో ఖరీదు చేయక తప్పేలా లేదు. ప్రభుత్వం సహకరించడం లేదు. పూర్తిగా ఎరువుల సరఫరా నిలిపేస్తే.. సాగు మానేస్తం. లేదా కర్ణాటక రాష్ట్రం కుంచారంకు వెళ్లి తెచ్చుకుంటాం.

– సంగప్ప, రైతు, నాగులపల్లి

కొరత తీర్చాలి



రాష్ట్ర ప్రభుత్వం ఎరవుల కొరత లేకుండా చుడాలి. మాకు సకాలంలో ఎరువులు, విత్తనాలను రైతులకు అందజేయాలి. ప్రభుత్వం సహకరించకుంటే ముందుకు సాగటం కష్టం. సంబంధిత అధికారులు స్పందించి, సమస్యకు పరిష్కారం చూపాలి. అందజేసే ఎరువులు.. విత్తనాలు నాటక ముందు సరఫరా చేయాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది.

– ఏసప్ప రైతు తట్టెపల్లి

దిగాలు వద్దు



ప్రతి రైతుకు సకాలంలో ఎరువులు అందచేయాలన్నదే మా లక్ష్యం. సకాలంలో సరఫరా కావడం లేదు. రైతులకు ఇబ్బంది తప్పడం లేదు. ఇప్పటి వరకు 550 టన్నుల యూరియ, 25 టన్నుల డీఏపీ, 22 టన్నుల 20–20 ఎరువులు అందజేశాం. మరో రెండు రోజుల్లో ఎరువులు వస్తాయి. ఎరువుల కోసం రైతులు దిగాలు చెందవద్దు. ప్రతి రైతుకు అందజేస్తాం.

– రాజమౌళి, సీఈఓ, తట్టెపల్లి పీఏసీఎస్

సుదీర్ఘ కాలయాపన!

- నత్తనడకన వంతెన నిర్మాణ పనులు
- కాగ్నా ఉధృతి తగ్గగానే గటర్లు, ఆపై స్లాబ్
- తాండూర్ ఆర్అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్

ధారూరు: దోర్నాల్–స్టేషన్‌ధారూరు గ్రామాల మధ్య కాగ్నా నదిపై నిర్మిస్తున్న వంతెన పనులు 2017 నుంచి నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఇరువైపులా రెండు అపార్ట్‌మెంట్లు, మధ్యలో నాలుగు టియర్స్(పిల్లర్లు)ను నిర్మించారు. టియర్స్‌పై గటర్లు అమర్చి, స్లాబ్ వేసే పనులే మిగిలాయని భావించగా.. అపార్ట్‌మెంట్స్‌కు సమానంగా గటర్ల ఎత్తు లేదని, 6 ఇంచులు తగ్గినట్లు తెలుస్తోంది. దీంతో మరో 6 అంగులాల ఎత్తు పెంచాల్సి ఉందని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే కాంట్రాక్టర్ వాటి ఎత్తు పెంచేందుకు వాటిపై స్టీల్‌రాడ్స్ అమర్చి, సీసీబెడ్ వేయడానికి సిద్ధం చేయగా.. ఏకధాటి వర్షాలతో పనులకు ఆటంకం కలిగింది. రాకపోకలు స్తంభించాయి. ఈ నెల4న రాకపోకలను పునరుద్ధరించారు. ప్రస్తుతం నాలుగు టియర్స్‌పై 6 అంగులాల బేరింగ్ పెడస్టాల్ నిర్మించాల్సి ఉంది. ఇందుకు వాటిపై స్టీల్‌రాడ్స్ వేయించామని తాండూర్ ఆర్అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. వర్షాలు పూర్తిగా తగ్గిన వెంటనే బేరింగ్ పెడస్టాల్స్ నిర్మించి, వాటిపై 24 గటర్లు అమర్చుతామని, అనంతరం స్లాబ్ పనులు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఒక్క వానాకాలం ప్రజలు వేచి ఉండక తప్పదని, కాగ్నా నది ప్రవాహ ఉధృతి తగ్గగానే పనులను ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. వంతెన పక్కనే నిర్మించిన డైవర్షన్ రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకుపోగా.. పునరుద్ధరించామని ఏఈ తెలిపారు.


కాగ్నా నదిపై నిర్మిస్తున్న టియర్స్‌పై బేరింగ్ పెడస్టాల్స్ నిర్మించదానికి వేసిన స్టీల్

పేదకుంటుంబానికి 'కిసాన్‌బంధు'వు

టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్


నగదు అందజేస్తున్న రవీందర్‌గౌడ్ తదితరులు

బొంరాస్‌పేట: 'కిసాన్‌బంధు' అనే సేవాసంస్థ విద్యావంతుల కోరిక మేరకు పేద కుటుంబాలకు ఆర్థిక సహకారం చేస్తూ 'కిసాన్ బంధువు'గా తోడ్పాటునందిస్తుందని తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన పేదరైతు భాగ్యలక్ష్మి కుమారుడు కార్తీక్‌కు రూ.10వేల నగదును అందజేశారు. మరో ముగ్గురికి రూ.50వేలు ఆర్థికసాయం అందిజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మూడేళ్లుగా కిసాన్‌బంధు సంస్థ నుంచి పేదరైతు కుటుంబాల పిల్లల చదువుల కోసం, ఆర్థిక అవసరాలకు ఆసరాగా ఉంటోందన్నారు. ఈ సందర్భంగా సేవాసంస్థ ప్రతినిధులు సతీష్, స్నేహలకు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీవీవీ, టీజేఏసీ నాయకులు అనిల్, గోపాల్, శశివర్ధన్, శ్రీనివాస్, లక్ష్మి, విజయలక్ష్మి, శ్రీప్రియ, జ్యోతి సునిత తదితరులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


శివకుమార్ (ఫైల్)

దోమ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. మండల పరిధి బుద్లాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్(20) ఈ నెల 3న క్రిమిసంహారక మందును సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని వికారాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు నగరంలోని ఆసుపత్రికి రేఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శివకుమార్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

మందలించడంతోనే..

శివకుమార్‌కు తల్లితండ్రులు చిన్నతనంలోనే మృతి చెందారు. అతనికి ముగ్గురు అక్కలు, ఓ అన్న ఉన్నారు. పెద్ద అక్క వసంతకు వివాహం కాగా.. ఇద్దరు అక్కలు రాధిక, రేణుక ఇంట్లోనే ఉంటున్నారు. అన్న కుమార్ నగరంలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసైన శివకుమార్‌ను అతని అక్కలు మందలించేవారు. దీంతో అతను వారిని కొట్టేవాడు. ఇతర బంధువులు వారిని ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించగా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే పొలానికి తెచ్చిన గడ్డిమందును సేవించి ఈ నెల 3న ఆత్మహత్యానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మతదేహన్ని పరిగి ప్రభుత్వ ఆసపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

కబ్జాదారుల నుంచి మా భూమిని కాపాడండి

- ఫిర్యాదు స్వీకరించని పోలీసులు
- కోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు
- విశ్రాంత ఉద్యోగ దంపతులు


ఎఫ్ఐఆర్‌ను చూపిస్తున్న కృష్ణమూర్తి దంపతులు

తాండూరు: 'ఉద్యోగ విరమణ అనంతరం వచ్చిన డబ్బుతో కొన్న జాగ అది. కొందరు స్థానిక ప్రజాప్రతినిధి పేరును అడ్డం పెట్టుకొని పట్టా భూమి కబ్జాకు పాల్పడుతున్నారు. మా భూమిని కాపాడండి' అని బాధితురాలు గిరిజాదేవి, కృష్ణమూర్తి దంపతులు మీడియా ముందు ఆవేదన వ్యక్తంచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గిరిజాదేవి, కృష్ణమూర్తి దంపతులు ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేసి కొన్నాళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం వచ్చిన డబ్బుతో పెద్దేముల్ మండలం దుగ్గాపూర్ గ్రామంలో సర్వేనె నంబర్ 39లో 12.23 ఎకరాల భూమి ఉండగా, అందులో 5 ఎకరాల భూమిని 2017 సంవత్సరంలో కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు. తర్వాత గిరిజాదేవి పేరిట పట్టాదారు పాసుబుక్కు రాగా.. వారు భూమిని స్వాధీనం చేసుకొని, పొలం చుట్టూ కంచె నిర్మించుకున్నారు. వ్యవసాయ పంటలను సాగు చేస్తుకుంటున్నట్లు పేర్కొన్నారు.

కంచె ధ్వంసం

జూన్ నెల 30న పెద్దేముల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్‌లతో పాటు నందకుమార్, బోయిని బాలప్ప, బొయిని శ్రీనివాస్‌లు తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, పొలం చుట్టూ వేసుకొన్న కంచెను ధ్వంసం చేశారని దంపతులు ఆరోపించారు. అడ్డుకునేందుకు వెళ్లిన వారిపై దాడికి యత్నించారని, పొలం వైపునకు వస్తే మమ్మల్ని చంపేస్తామని బేదిరిస్తున్నట్లు వాపోయారు.

ఫిర్యాదు నిరాకరణ

కబ్జా విషయమై పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో అదేరోజు ఫిర్యాదు చేసేందుకు వెళితే.. పోలీసు అధికారులు ఫిర్యాదు స్వీకరించలేదని వారు ఆరోపించారు. వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్, తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలను కలిసి సమస్య పరిష్కరించాలని వేడుకున్నట్లు వివరించారు. అయినా తమకు న్యాయం జరగలేదని తెలిపారు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, కబ్జాకు పాల్పడిన నలుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించిందని వారు వెల్లడించారు. అనంతరం పెద్దేముల్ ఠాణాలో ఈ నెల 3న ఎస్సై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు. పోలీసు, రెవెన్యూ అధికారులు తమ భూమని కాపాడాలని వేడుకున్నారు.

అన్ని సౌకర్యాలు ఉన్నాయా?

తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి

మోమిన్‌పేట: పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే పాఠశాల గదుల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయా అంటూ తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. శనివారం మండలంలోని మేకవనంపల్లి, అంరాధికలాన్, అంరాధికుర్దు, కోల్కుంద, రావులపల్లి, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేసే పాఠశాలలో విద్యుత్, తాగునీరు, గదులకు వచ్చేందుకు ఇబ్బందులు కలుగకుండా ర్యాంపు తదితర వాటిని చూశామన్నారు. రానున్న సాధారణ ఎన్నికలకు ముందస్తు కసరత్తులో భాగంగానే పోలింగ్ స్టేషన్‌లను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ రాజు, ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలి

కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా


కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు, ఏఐటీయూసీ నాయకులు

తుక్కుగూడ: వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పానుగంటి పర్వతాలు, ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా వైద్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌ఎంలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ఏఎన్ఎంల భర్తీ పేరుతో నోటిఫికేషన్ విడుదల చేయడం దారుణమన్నారు. వృత్తిలో నైపుణ్యం వారిని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకురాలు పద్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డస్ట్‌లోడ్ ఖాళీ చేస్తుండగా..

విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి

చేవెళ్ల: టిప్పర్‌లో డస్ట్‌లోడ్ ఖాళీ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా ముద్బి గ్రామానికి చెందిన కూరి వెంకట్(30) బతుకు దెరువుకోసం 5 సంవత్సరాల నుంచి సంగారెడ్డి జిల్లా కంది మండలం రుద్రారంలో నివాసం ఉంటున్నాడు. చేవెళ్లకు చెందిన గుత్తి నర్సింలు వద్ద టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చేవెళ్లలోని ఏసీఈ వెంచర్‌లో శనివారం తెల్లవారుజామున ఓ వెంచర్‌లో టిప్పర్‌లారీలో డస్ట్‌లోడ్ నింపుకుని వెళ్లాడు. అక్కడ దాన్ని ఖాళీ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు లారీకి పైన ఉన్న 33 కేవీ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై వెంకట్ అక్కడి కక్కడే మృతి చెందాడు. ఈ విషయం భార్యకు తెలియడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ

అనంతగిరి: విధినిర్వహణలో ఎంత బిజీగా ఉన్నా తప్పనిసరిగా పోలీస్ అధికారి పరేడ్‌లో పాల్గొనాలని ఎస్పీ కోటిరెడ్డి చెప్పారు. శనివారం ఎస్పీ కార్యాలయ ఆవరణ పరేడ్ మైదానంలో వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ జూమ్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏ ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


పోలీసులకు పట్టుబడ్డ ట్రాక్టర్, డ్రైవర్ రాజు

మంచాల: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. మంచాల ఎస్ఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. యాదాద్రి జిల్లా నారాణపురం మండలం రాచకొండకు చెందిన రాజు కొన్ని రోజులుగా ఇసుకను అక్రమంగా తరలిస్తూ విక్రయిస్తున్నాడు. శనివారం ఇసుక తరలిస్తుండగా ఆరుట్ల సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టగా ఎటువంటి అనుమతి పత్రాలు లభించలేదు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి రాజుపై కేసు నమోదు చేశామన్నారు.

అమ్మమ్మను చూసేందుకు వచ్చి..


బైక్‌ను ఢీకొట్టడంతో సిమెంట్ ట్యాంకర్ టైర్ల కింద పడిన విఘ్నేశ్‌చారి

- రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం
- బైక్‌ను ఢీ కొట్టిన సిమెంట్ ట్యాంకర్
- మొయినాబాద్ సమీపంలో ఘటన


విఘ్నేశ్‌చారి (ఫైల్)

మొయినాబాద్: వెనుక నుంచి వేగంగా వచ్చిన సిమెంట్ ట్యాంకర్.. బైక్‌ను ఢీకొట్టడంతో ఓ బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన శనివారం మొయినాబాద్ సమీపంలోని రాధాస్వామి సత్సంగ్ సమీపంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా కుల్కచర్లకు చెందిన కొత్తపల్లి విఘ్నేశ్‌చారి (19) తల్లి మరణించడంతో.. తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. దీంతో బాలుడు చేవెళ్ల మండలం దేవరంపల్లిలో అమ్మమ్మ సువర్ణ వద్ద ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పదిహేను రోజుల క్రితం విఘ్నేశ్‌చారి నగరంలోని కార్వాన్‌లో ఉండే మామ వద్దకు వెళ్లాడు. అమ్మమ్మ మొయినాబాద్‌లోని భాస్కర ఆస్పత్రిలో కళ్ల వైద్యం చేయించుకునేందుకు వెళ్లిందని తెలియడంతో శనివారం ఆమెను పరామర్శించి రూ.2 వేలు ఇచ్చాడు. అనంతరం మొయినాబాద్ సమీపంలోని రాధాస్వామి సత్సంఘ్ వద్ద రోడ్డు పక్కన ఆగి భోజనం చేశాడు. రూ.500 నోటు ఇవ్వడంతో హోటల్ నిర్వాహకులు చిల్లర లేవని చెప్పారు. దీంతో మొయినాబాద్‌కు వెళ్లి, చిల్లర తీసుకుని వెనుదిరిగాడు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తికి లిఫ్ట్ ఇచ్చాడు. అతన్ని ఎక్కించుకుని వచ్చి హోటల్ వద్ద బైక్ మలుపుతుండగా వెనకనుంచి అతివేగంగా వచ్చిన సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టింది. వెనక కూర్చున్న వ్యక్తి ఎగిరి రోడ్డు పక్కన పడగా.. విఘ్నేశ్‌చారి ట్యాంకర్ టైర్ల కింద పడ్డాడు. అతని నడుముపై నుంచి వెళ్లిన వాహనం కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రోడ్డు పక్కన ఎగిరిపడ్డ వ్యక్తి ప్రాణాలతో బయటపడి అక్కడి నుంచి పారిపోయాడు. ఇదిలా ఉండగా విఘ్నేశ్‌చారి తల్లి ఆరేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత రెండేళ్లకే అన్న మరణించాడు. ఆస్పత్రిలో ఉన్న అమ్మమ్మను చూసేందుకు వచ్చిన విఘ్నేశ్‌ను ట్యాంకర్ బలితీసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.